క్లుప్తంగా

పుస్తక పఠనం... జ్ఞానాభివృద్ధికి మార్గం



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ శ్రీధర్

లక్కవరపుకోట: విజ్ఞానం పెంపొందించుకునేందుకు విద్యార్థులు చిన్నతనం నుంచే పాఠ్యపుస్తకాలతో పాటు కథలు, శాస్త్ర, సాంకేతిక అంశాలు, ఇతిహాసాలు, మహనీయుల జీవితచరిత్ర తదితర పుస్తకాలను చదవాలని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి దామోధర్ శ్రీధ ర్ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు కథలు చెప్పారు. అలాగే వారితో పాటలు పాడించడంతో పాటు పుస్తకపఠనం చేయించారు.అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు.

చురుగ్గా సీసీ కాలువల నిర్మాణం



జోరుగా సాగుతున్న కాలువ నిర్మాణ పనులు

గజపతినగరం: మండలంలో ఎస్.జి.ఆర్.పురం గ్రామంలో సీసీ కాలువల(డ్రైనేజ్) నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుమారు రూ.2 లక్షలతో కాలువలు నిర్మిస్తున్నామని వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చురుగ్గా సాగుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సహాయం



బాధితుడికి నగదు అందస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తవలస రూరల్: మండలంలో నిమ్మలపాలెం గ్రామానికి చెందిన పొలిపర్తి అక్కునాయుడు బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. బాధితుడిది పేద కుటుంబం కావడంతో వైద్యఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసు కున్న అదే గ్రామానికి చెందిన జాయినింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బాధితుడికి రూ.12 వేల ఆర్థిక సహాయం చేశారు. నగదును ట్రస్టు సభ్యులు గొంప రాంబాబు తదితరులు అక్కునాయుడుకి ఆదివారం అందజేశారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



ఓ పెట్రోల్ బంకులో రికార్డులను పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ

చీపురుపల్లి: పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో సీఎస్‌డీటీ రామారావు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. బంకుల్లో ఉన్న ప్రస్తుత పెట్రోల్ నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లను, నిబంధనలు పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బంకుల నిర్వహించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోమటిపల్లిలో పారిశుద్ధ్య పనులు



పూడికలు తీస్తున్న కార్మికులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో సర్పంచ్ రొంగలి రాములమ్మ ఆధ్వ ర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని వీధి కాలువల్లో పూడికలను, బహిరంగ ప్రదేశాల్లో చెత్తచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలకు సర్పంచ్ సూచించారు.

వీరభద్రపురంలో మేలుకొలుపు



హరినామ సంకీర్తనలతో మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

కొత్తవలస రూరల్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వీరభద్రపురం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. సమరసత సేవాసమితి సభ్యుడు నరసింగరావు ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు హరినామ సంకీర్తనలు చేస్తూ గ్రామంలోని అన్ని వీధుల్లో మేలుకొలుపు నిర్వహించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నిమ్మలపాలెం పంచాయతీ కేంద్రంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరగా... ఎమ్మెల్యే స్పందిస్తూ పంచాయతీలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేయించి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి అని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల్లో తక్షణం పరిష్కరించాల్సిన వాటి కోసం ప్రతీ సచివాలయాలనికి రూ.20 లక్షలు సీఎం జగన్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాల్లోని పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, పథకాలకు సంబంధించిన డబ్బులను అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని మూడు దఫాల్లో రూ.2,750కు పెంచారని, వచ్చేఏడాదికి రూ.3 వేలు అందజేస్తామని చెప్పారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకుండా ఇంటి తలుపు తట్టి వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందిస్తున్న విషయాన్ని అవ్వాతాతలు గుర్తించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో 98 శాతం హామీలను మూడున్నరేళ్లలో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. పథకాల మంజూరులో పార్టీలు, కుల, మతాలు,చూడడం లేదని, అర్హతే ప్రామాణికంగా తీసుకుని పారదర్శకంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజాసంక్షేమం కోసం పరితపించే సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలం శెట్టి గోపమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పలుగ్రామాల సర్పంచ్‌లు, నాయకులు కొట్యాడ నిర్మలా సాయి, భూసాల దేముడు, జామి ఈశ్వరరావు,కోన దేముడు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, మదిన అప్పల రమణ, కొట్యాడ శ్రీను, పప్పల బంగారు నాయుడు, అతవ రమేష్, అడిగర్ల సంతోష్, ఎంపీడీఓ పద్మజ, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, రగ్గుల పంపిణీ



కొత్తవలస రూరల్: వృద్ధులకు సరుకులు, రగ్గులు పంపిణీ చేస్తున్న ఫర్‌ది పీపుల్, సత్యసాయి ట్రస్టుల సభ్యులు



జామి: అన్నదానం చేస్తున్న ద్వారకామయి సేవాసమితి సభ్యులు

కొత్తవలస రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపిక చేసిన 35 మంది వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరు కులను ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తుమ్మికాపల్లిలో ఆదివారం పంపిణీ చేశారు. ప్రతీ నెల తమ ట్రస్టు ద్వారా వృద్ధులకు సాయం చేస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. అలాగే సత్యసాయిట్రస్టు ద్వారా వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. సత్యసాయి ట్రస్టు చైర్మన్ హరి, సభ్యులు మంచాల రామమ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకామయి ఆధ్వర్యంలో..

జామి: మండలంలోని యాతపాలెం గ్రామంలో ద్వారకామయి సేవాసమితి ఆధ్వర్యంలో సుమారు 200 మంది పేదలు, వృద్ధులకు ఆదివారం చీరలు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. సుమారు 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ద్వారకామయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్ వెనక ఉన్న ఇన్‌స్పైర్ స్కూల్ ఆవరణలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏపీ తైక్వాండో అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో విజయనగరానికి చెందిన విన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోచ్‌లు, క్రీడాకారుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమని, అందరూ క్రీడాస్ఫూర్తి కనబరిచి మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల టైక్వాండో క్రీడాకారులు మరింత మెలకువలు నేర్చుకుని, భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించా లని కోరారు. ఇటువంటి కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం ఆమెను నిర్వాహకులు, క్రీడాకారులు సత్కరించారు. కార్యక్రమంలో చారి, రిఫరీ కోదండరాం, పెద్దింటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని సన్మానిస్తున్న తైక్వాండో క్రీడాకారులు

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తవలస రూరల్: మండలంలో దేవాడ కేంద్రంగా 12 గ్రామాలకు సంబంధించిన వాసవి క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికను వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరి సతీష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా వజ్రపు శ్రీనివాసరావు, కార్యదర్శిగా విన్నకోట గుప్తా, కోశాధికారిగా వరిగాల నానాజీని, ఇతర కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ సతీష్ ప్రమాణ స్వీకారం చేయించారు.



క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు ఎన్నికపత్రాన్ని అందజేస్తున్న వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ సతీష్

పర్యావరణ పరిరక్షణకు కృషి

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీవాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని ఆలుగుబిల్లి గ్రామంలో పాఠశాల, ఆలయాల ప్రాంగణాల్లో విజినిగిరి వాసవీక్లబ్ సభ్యులతో కలిసి ఆదివారం కొబ్బరి మొక్కలు నాటారు. అంతకు ముందు విజినిగిరి క్లబ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. క్లబ్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ ఏ.సతీష్, అధ్యక్షులు కె.ఎస్.సత్యనారాయణ, కోశాధికారి పి.కామేష్, సెక్రటరీ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కొబ్బరి మొక్కలు నాటుతున్న వాసవీ క్లబ్ సభ్యులు

అపూర్వ కలయిక



విజ్ఞానజ్యోతి కళాశాల 2002-2004 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో 2002-2004 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ చదువుకున్న 120 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట ఆదివారం అదే కళాశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. వివిధ వృత్తుల్లో, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు, వృత్తి, కుటుంబ జీవితాల గురించి తెలుసుకున్నారు. అప్పటిలో వారికి పాఠాలు బోధించిన అధ్యాపకులను సన్మానించారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

గజపతినగరం/బొండపల్లి: నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గజపతినగరం, బొండపల్లి మండలాల నాయకులతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం ఉదయం సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించి గజపతినగరం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, బొండపల్లి ఎంపీపీ చల్ల చలంనాయుడు ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సమావేశానికి నూతనంగా నియమితులైన పార్టీ సచివాలయ కన్వీనర్లతో పాటు ఎంపీపీ లు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు హాజరు కావాలని కోరారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు నివాసం వద్ద ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు ఆదివారం తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు హాజరు కావాలని కోరారు.

గురుకుల విద్యార్థినికి ఇన్‌స్పైర్ అవార్డు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని గేదెల పూజిత ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైందని ప్రిన్సిపాల్ యు.విజయకుమార్‌పాత్రో ఆదివారం తెలిపారు. విద్యార్థిని తయారు చేసిన హరిత సంచులు (బయోబ్యాగ్స్) ప్రాజెక్టుకు జిల్లాస్థాయిలో అవార్డు దక్కిందని, రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ప్రాజెక్టు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థినితో పాటు గైడ్‌లుగా వ్యవహరించిన సైన్స్ ఉపాధ్యాయులు ఇంద్రజ, భూలక్ష్మిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిపూజితతో సైన్స్ ఉపాధ్యాయిని ఇంద్రజ

'ఆడారి' సంతాప సభ



తులసీరావుకు నివాళులు అర్పిస్తున్న గౌరీ సేవా సంఘ కార్యవర్గసభ్యులు

శృంగవరపుకోట: విశాఖ డెయిరీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించిన ఆడారి తులసీరావు మరణం ఉత్తరాంధ్ర పాడి రైతులకు తీరని లోటు అని గౌరీ సేవాసంఘం గౌరవ అధ్యక్షుడు కాంద్రేగుల విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని భవానీనగర్‌లో గౌరీసేవా సంఘం నేతృత్వంలో ఆదివారం సంతాపసభ నిర్వహించారు. గవరపాలెం, భర్తాపురం, భవానీనగర్, గౌరీపురం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సభ్యులు హాజరయ్యారు. ఆడారి తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ అభివృద్ధికి తులసీరావు ఎనలేని కృషి చేశారని, చాలామంది పాడి రైతుల కుటుంబాలకు విద్య, ఆరోగ్య, వైద్యం, తదితర సౌకర్యాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి పి.తాతనాయుడు, ,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

- లూయిస్ బ్రెయిలీ జయంతిలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలీ అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో సారధి వెల్ఫేర్ అసోసియేషన్, విజువల్లి చాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి ఆదివారం నిర్వహించారు. తొలుత జెడ్పీ చైర్మన్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని జయించి, అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపించిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని అన్నారు. బ్రెయిలీ లిపి నేర్చుకుని నేడు ఎంతో మంది వివిధ రంగాల్లో విజయం సాధిస్తున్నారని తెలిపారు. దివ్యాంగుల కోసం ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక పథకాలను మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మీ సేవా కేంద్రాన్ని దివ్యాంగుల వసతి కోసం తక్కువ రుసుంతో కేటాయించడం జరుగుతోందన్నారు. అన్ని వసతులు కల్పించాలని దివ్యాంగుల శాఖ డైరెక్టర్‌ను జెడ్పీ చైర్మన్ ఆదేశించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ వసతి గృహానికి నెలవారీ అయ్యే రుసుంను తాను అందజేస్తానని ప్రకటించారు. అనంతరం అసోసియేషన్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణితో కలిసి వారు ఆవిష్కరించారు. సేల్స్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వికలాంగుల శాఖ ఏడీ జీవీబీ జగదీష్, సత్య గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్స్ డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ వ్యవస్థాపకులు దవడ కొండబాబు, సారధి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్‌కుమార్, ఎల్.రత్నరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జీడి,మామిడిని ముంచేస్తున్న మంచు

- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- తేనె మంచు పురుగు ఆశించడంతో మాడిపోయి రాలిపోతున్న పూత
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన అధికారుల సూచన



కొత్తవలస : తేనె మంచుకారణంగా మాడిపోతున్న మామిడిపూత



కొత్తవలస: బలిఘట్టాం గ్రామ సమీపంలో పూతదశలో ఉన్న మామిడి



గుర్ల: మామిడి తోటలో కురుస్తున్న మంచు

గుర్ల/ కొత్తవలస: జీడి,మామిడి రైతుల ఆశలపై మంచు కమ్మేసింది. జీడి,మామిడి తోటలు పూత దశకు రావడం నుంచి పిందె దశకు మారడంలో ఇదే కీలక సమయం. పూతనిలకడపైనే దిగుబడులు ఆ ధారపడి ఉంటాయి.అయితే కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న పొగమంచు ప్రభావంతో పూత మాడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు లక్షా 20వేల హెక్టార్లలో మామిడి, జీడిసాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉండవచ్చని భావించిన రైతులను వారం రోజులుగా కురుస్తున్న మంచు కలవరపెడుతోంది. సాయంత్రం 5 నుంచి ఉదయం 8 గంటల వరకూ పొగమంచు విపరీతంగా కురుస్తోంది. ఈ ప్రభావంతో జీడి, మామిడి పూత నల్లగా మారి రాలిపోతోంది. పూత ను తేనె మంచు పురుగు కూడా ఆశించడంతో రైతు లు ఆందోళన చెందుతు న్నారు. మరి కొద్దిరోజుల పాటు మంచు కురవడం ఇలాగే కొనసాగితే పంటపై ఆశలు వదులు కోవాల్సిందేనని రైతులు అంటున్నారు.

పూత మాడిపోయి రాలిపోతోంది

కొద్ది రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో మామిడి పూత మాడిపోయి రాలిపోతోంది. ఈఏడాది అధిక దిగుబడులు వస్తాయని ఆశించాం. కానీ వాతావరణం అనుకూలించక పోవడంతో నష్టపోయే అవకాశం ఉంది.

– లెంక ఉత్తరనాయుడు, రైతు, జమ్ము గ్రామం, గుర్ల మండలం

సస్యరక్షణ చర్యలతో అధిక ఫలసాయం

మామిడి పంటకు సంబంధించి సకాలంలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక ఫల సాయం పొందవచ్చు. ప్రస్తుతం తేనె మంచు పురుగు ప్రభావంతో పాటు పొటాష్ లోపం వల్ల మామిడిపూత రాలిపోతుంది. పొటాష్ లోపం నివారణకు 5 గ్రాముల పొటాషి యం నైట్రేటు మందును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరా విస్తీర్ణంలోని తోటకు పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో రెండో విడత పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల పూత నిలబడుతుంది. తేనెమంచు పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరానికి పిచికారీ చేయాలి. లేదా క్లోరీఫైరిపాస్ 2 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి ఎకరాకి పిచికారీ చేయాలి.

– హెచ్.ఉమాభరణి, ఉద్యానవనశాఖ అధికారి, కొత్తవలస

సూచనలు పాటించాలి

రైతులు ఉద్యానవన శాఖ సిబ్బంది సూచనలు, సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు పాటిస్తే జీడి, మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం కొన్ని చోట్ల మామిడి తోటలకు పూత రాలేదు. పూత వచ్చిన తోటల్లో పూత నిలవడానికి లీటర్ నీటికి 1.5 మిల్లీ లీటర్ల ప్రొఫనోపాస్ మందును పిచికారీ చేయాలి. పూతరాని చెట్లకు నాఫ్టలిస్ అసిటిక్ ఆమ్లాన్ని స్పిరిట్‌తో నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల పూత వచ్చే అవకాశం ఉంది.

– చంద్రశేఖర్, ఉద్యానవన శాఖ అధికారి, చీపురుపల్లి